నమస్తే తెలంగాణ
వరంగల్
హనుమకొండ
5 | గురువారం 28 డిసెంబర్ 2023 | WARANGAL HANUMAKONDA

# జనవరి 5 నుంచి అద్దె బస్సులు బంద్

## హైర్‌బస్ ఓనర్ల వరంగల్ రీజియన్ అధ్యక్షుడు రాంరెడ్డి



మాట్లాడుతున్న రాంరెడ్డి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 27: రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేలా ఆర్టీసీ అధికారుల విధానాలు ఉన్నాయని హైర్‌బస్ ఓనర్ల వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపెల్లి రాంరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో హైర్‌బస్ ఓనర్ల రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడారు. 2021లో వర్తింపజేయాల్సిన వేతన ఒప్పంద సర్క్యులర్ 38/2022ను ఇప్పుడు సవరిస్తూ తీసుకుంటున్న ఆర్టీసీ అధికారుల చర్యలు అనాలోచితమని, 2022లో కొన్ని బస్సులకు, 2023లో కొన్ని బస్సులకు వర్తింపజేస్తున్నారని, లోపభూయిష్టమైన సర్క్యులర్‌ను వెంటనే సవరించాలన్నారు. మహాలక్ష్మీ స్కీమ్‌కు అధిక బస్సులు అవసరమైనప్పటికీ ఎవరూ టెండర్‌లో పాల్గొనకుండా కొందరు కుట్రపన్నుతున్నారని, ఏదైనా కారణంతో బస్సు ఆగితే రోజుకు రూ.35వేలు రికవరీ చేస్తామనడం ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడమేనన్నారు. కొందరి ఆలోచన విధానాలకు నిరసనగా జనవరి 5 నుంచి అద్దెబస్సుల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. కె.సదానందం, జే.సునీల్‌రెడ్డి, హబీబుద్దీన్ పాల్గొన్నారు.

## నియోజకవర్గాల వారీగా స్పెషల్ ఆఫీసర్లు వీరే..

| నియోజకవర్గం | ప్రత్యేక అధికారి | హోదా | సెల్ నంబర్ |
|---|---|---|---|
| వరంగల్ పశ్చిమ | మేన శ్రీను | మైనార్టీ వెల్ఫేర్ అధికారి | 9100139282 |
| జీడబ్ల్యూఎంసీ | కృష్ణారెడ్డి | డిప్యూటీ కమిషనర్ | ---- |
| స్టేషన్ ఘన్‌పూర్ (ధర్మసాగర్, వేలేరు) | ఎస్.వెంకటేశ్వర్‌రావు | జడ్పీ సీఈవో | 7901616024 |
| హుజూరాబాద్ | వీ జగదీశ్వర్ | డీపీవో | 9912289293 |
| భూపాలపల్లి (శాయంపేట మండలం) | హరిప్రసాద్ | ఇండస్ట్రీస్ జీఎం | 9640908877 |
| భూపాలపల్లి | రమాదేవి | ఆర్డీవో | 7995059392 |
| పరకాల | జీ రాంరెడ్డి | బీసీ వెల్ఫేర్ డీడీ | 9440548395 |
| వర్ధన్నపేట | బీ సత్యనారాయణరెడ్డి | సీపీవో | 9849901400 |
| హుస్నాబాద్ | ఎ.శ్రీనివాస్‌కుమార్ | డీఆర్‌డీవో | 6309953666 |
| జనగామ | కే అనిల్‌కుమార్ | జడ్పీ సీఈవో | 9440546101 |
| స్టేషన్ ఘన్‌పూర్ | వీ రామ్మూర్తి | ఆర్డీవో | 7995087859 |
| పాలకుర్తి | రంగాచారి | డీపీవో | 9703033348 |
| ములుగు | వేణుగోపాల్ | అదనపు కలెక్టర్ | 7331122632 |
| భద్రాచలం (వాజేడు, వెంకటాపురం(నూ) | సత్యపాల్‌రెడ్డి | ఆర్డీవో | 7331122632 |
| మహబూబాబాద్ | సూర్యనారాయణ | ఉద్యాన శాఖ అధికారి | 7997725108 |
| డోర్నకల్ | సుధాకర్ | పశుసంవర్ధక శాఖ అధికారి | 8008486262 |

# సింగరేణి ఎన్నికలు ప్రశాంతం

- భూపాలపల్లి ఏరియాలో 94.7 శాతం పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న 5,123 మంది కార్మికులు



కేటీకే –5 ఇంక్లైన్‌లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి నిలబడిన సింగరేణి కార్మికులు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 27: భూపాలపల్లి సింగరేణి ఏరియాలో బుధవారం జరిగిన సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు కొనసాగింది. ఎన్నికల్లో మొత్తం 13 కార్మిక సంఘాలు పోటీ చేశాయి. సింగరేణి యాజమాన్యం 9 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,410 మందికి 5,123 కార్మికులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు 16.5 శాతం, 11 గంటలకు 53.2 శాతం, మధ్యాహం ఒంటి గంటకు 67.3 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 94.7 శాతం నమోదైంది. కేటీకే –5 ఇంక్లైన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోకి సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు రెడ్ టీషర్టులు ధరించి వెళ్తుతుండగా పోలీసులు, ఐఎన్‌టీయూసీ నాయకులు అడ్డుకోగా ఇరువర్గాల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. కేటీకే –2 ఇంక్లైన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోకి కాంగ్రెస్ అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులు కాంగ్రెస్ కండువాలు వేసుకొని వెళ్లగా పోలీసు అధికారులు వారిని అడ్డుకోగా వారి మధ్య తీవ్ర వాగ్వావాదం జరిగింది. ఎస్పీ కిరణ్ ఖరే, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ఐదుగురు బృందం ఎన్నికల సరళిని పర్యవేక్షించింది. 9 పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్స్‌లను అంబేద్కర్ స్టేడియంలోని మినీ ఫంక్షన్ హాల్‌కు తరలించారు. సాయంత్రం 7 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. 5 టేబుళ్లను ఏర్పాటు చేసి రెండు రౌండ్లలో ఓట్లను లెక్కించి అర్ధరాత్రి వరకు ఫలితాలు తెలుపనున్నారు.

# 29న మేడిగడ్డకు రాష్ట్ర మంత్రుల బృందం



జయశంకర్ భూపాలపల్లి. డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ) : ఈ నెల 29న రాష్ట్ర మంత్రుల బృందం జిల్లాలోని మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లను సందర్శించింది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖల మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు, రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఈఎన్‌సీ మురళీధర్‌రావు శుక్రవారం ఉదయం 11:30 గంటలకు హెలీకాప్టర్ ద్వారా హైదరాబాద్ నుంచి మేడిగడ్డకు చేరుకుంటారు. 11:30 నుంచి ఒంటి గంట వరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈఎన్‌సీ మురళీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. మేడిగడ్డ బరాజ్ పిల్లర్ కుంగుబాటు, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల డ్యామేజీపై సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలిస్తారు. అనంతరం భోజనం తరువాత 3 గంటలకు హెలీకాప్టర్‌లో అన్నారం బరాజ్‌కు వెళ్తారు. 3:20 గంటల నుంచి 4:20 గంటల వరకు బరాజ్‌ను పరిశీలించి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్తారు.



# నేటి నుంచి ప్రజాపాలన

## లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ, వార్డుసభలు

- ఎనిమిది రోజుల పాటు నిర్వహణకు కార్యాచరణ
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- దరఖాస్తుల స్వీకరణకు 100మందికి ఒక కౌంటర్
- గ్రేటర్ వరంగల్‌లో ప్రతి డివిజన్‌లో 10 కౌంటర్లు
- పర్యవేక్షణ, సమన్వయం కోసం ప్రత్యేక అధికారుల నియామకం
- నియోజకవర్గాలు, మండలాల వారీగా అధికారుల కేటాయింపు

ప్రజాపాలన గ్రామ, వార్డు సభలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం హామీల్లో భాగంగా మహాలక్ష్మి, రైతుభరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నేటి(గురువారం) నుంచి జనవరి 6 వరకు ఈ సభలను నిర్వహించనున్నది. ఎనిమిది రోజుల పాటు సాగే ఈ సభలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లుచేయగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు 100 మందికి ఒకటి చొప్పున కౌంటర్ల ఏర్పాటు, సభల నిర్వహణ కోసం ప్రత్యేక అధికారులను నియమించింది. ఉమ్మడి జిల్లాకు నోడల్ ఆఫీసర్‌గా వాకాటి కరుణను కేటాయించడంతో పాటు నియోజకవర్గాలకు, మండలాలకు ప్రత్యేక అధికారులను కేటాయించింది. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దని, ఎలాంటి రద్దీ లేకుండా ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో దరఖాస్తులు స్వీకరించాలని, అందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది.

– వరంగల్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ)/ హనుమకొండ/ వరంగల్/ ఖిలా వరంగల్

- సభల నిర్వహణకు మండలానికి 2 నుంచి 4 టీమ్‌ల చొప్పున బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఏవోలు టీమ్ లీడర్లుగా నియమితులయ్యారు. గురువారం నుంచి ఎనిమిది పనిదినాల్లో సభల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఒక్కో బృందం పని దినాల్లో రోజూ షిఫ్టు పద్ధతిన రెండు గ్రామ, వార్డుసభలను నిర్వహించనున్నది.
- గ్రామసభకు ముందు రోజే ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులు, ఇతర అధికారులు దరఖాస్తు ఫారాలను ప్రజలకు అందజేస్తారు. వాటిని నింపి ఆయా తేదీల్లో నిర్వహించే సభల్లో అధికారులకు అందజేయాలని కలెక్టర్లు సూచించారు.
- రోజుకు రెండు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంట ల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామసభల ఏర్పాటుతో తగిన కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తారు.
- దరఖాస్తులో ఉన్న ఐదు పథకాలకు సంబంధించి ఒకే దరఖాస్తు ద్వారా స్వీకరించాలని తెలిపారు.
- తప్పనిసరిగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి రాయడం రాని వారికి దరఖాస్తులు పూరించేలా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, దరఖాస్తులు స్వీకరణలో వృద్ధులకు, దివ్యాంగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.
- దరఖాస్తు స్వీకరించిన వెంటనే రశీదు ఇవ్వాలని కలెక్టర్లు స్పష్టం చేశారు. సభలో మైక్, టెంట్, కుర్చీలు, టేబుల్స్, క్యూలైన్ బారికేడ్స్, దరఖాస్తులు, తాగునీటి సౌకర్యం తదితర వసతులు కల్పించాలని సూచించారు.
- జిరాక్స్ సెంటర్ల యజమానులు దరఖాస్తుల ప్రతుల కోసం ఎక్కువ రుసుము వసూలు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
- ప్రతిరోజూ సాయంత్రంలోగా నిర్ణీత ప్రొఫార్మాలో రిపోర్టులు అధికారులు సమర్పించాలని ఆదేశించారు.
- ప్రజాపాలన కార్యక్రమం తిరిగి నాలుగు నెలలకోసారి నిర్వహిస్తామని, దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.
- గ్రామసభల ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారులు ముందురోజే వెళ్లి పరిశీలించి దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లను పర్యవేక్షించాలని, టామ్ టామ్, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలిసేలా కార్యాచరణ ఉండాలని కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య ఆదేశించారు.

### వరంగల్ నోడల్ ఆఫీసర్‌గా వాకాటి కరుణ



ప్రజాపాలన కార్యక్రమ అమలు తీరును పర్యవేక్షించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించింది. ఈమేరకు బుధవారం సీఎస్ శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు నోడల్ అధికారిగా వాకాటి కరుణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన సభల నిర్వహణ తీరును పరిశీలిస్తూ యంత్రాంగానికి సూచనలు చేస్తూ కార్యక్రమం విజయవంతానికి ఆమె కృషి చేయనున్నారు.

### వరంగల్ జిల్లాలో 1,756 కౌంటర్లు

వరంగల్ జిల్లాలో 391 గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించేందుకు 1,756 కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని 323 గ్రామ పంచాయతీలు, నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 24, వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో 12, జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 32 వార్డుల్లో సభల నిర్వహించనున్నారు. జిల్లాలో 2,65,323 ఇండ్లు ఉన్నందున 391 గ్రామ, వార్డు సభల్లో 1,756 కౌంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కలెక్టర్ పీ ప్రావీణ్య ఓ ప్రకటనలో తెలిపారు. 323 గ్రామ పంచాయతీల పరిధిలో 1,32,228 ఇండ్లు ఉన్నందున 1,283, నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 12,724 ఇండ్ల కోసం 120, వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 3,619 ఇండ్ల కోసం 33, జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 32 వార్డుల్లో గల 1,16,752 ఇండ్ల కోసం 320 కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు.

### గ్రేటర్‌లో డివిజన్‌కు 10 కౌంటర్లు

గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లలో అభయ హస్తం గ్యారెంటీలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈమేరకు ప్రతి డివిజన్‌లో 10 చొప్పున కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. మహిళలకు 6, వృద్ధులు, వికలాంగులకు 1, జనరల్‌గా 3 బల్దియా అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రజా పాలన కేంద్రం పరిధిలో 2 వేల నుంచి 4500 కుటుంబాలు ఉన్నాయి. ప్రజా పాలన సమర్థంగా నిర్వహించేందుకు ఇప్పటికే గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ప్రజా పాలన కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అదేశించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ప్రత్యేకంగా 8 బృందాలను ఏర్పాటు చేశారు.



# సమష్టిగా నగరాభివృద్ధి సాధిద్దాం

## సాఫీగా బల్దియా సర్వసభ్య సమావేశం

- కొత్త ఎమ్మెల్యేలను సన్మానించిన మేయర్
- పాలకవర్గానికి సహకరిస్తాం : ఎమ్మెల్యేలు
- నాలుగు ఎజెండా అంశాలకు ఆమోదం
- 24గంటల నీటి సరఫరాకు చర్యలు : మేయర్ గుండు సుధారాణి

వరంగల్, డిసెంబర్ 27 : మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. బుధవారం మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన ఉదయం 11.45 గంటలకు కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో బల్దియా సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. కొత్తగా ఎన్నికైన గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు కౌన్సిల్ హాజరయ్యారు. తూర్పు నియోజకవర్గం నుంచి ఎన్నికై మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొండా సురేఖ కౌన్సిల్ సమావేశానికి హాజరుకాలేదు. సభ ప్రారంభం కాగానే మేయర్ సుధారాణి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డిలకు పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ప్రమాణం స్వీకారం చేయాల్సి ఉన్నప్పటికీ మంత్రి కొండా సురేఖ హాజరుకానందున మరో సమావేశంలో చేయనున్నట్లు తెలిసింది.

### ఎజెండా అంశాలకు ఆమోదం

కౌన్సిల్‌లో నాలుగు ఎజెండా అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. విధి నిర్వహణలో మృతి చెందిన ప్రజారోగ్య, మలేరియా విభాగాలకు చెందిన కార్మికులు ఎర్ర స్వామి, మైదం జనార్దన్, ఎర్ర రాజుల కుటుంబాలకు రూ.1.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు, ఇంజినీరింగ్ విభాగం తాగునీటి నిర్వహణ కోసం మూడు ఫిల్టర్‌బెడ్‌లలో హెచ్‌పీ పంపులు, వ్యాక్యూమ్ పంపులు, మోటార్ సెట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.93 కోట్లతో కొనుగోలు చేసేందుకు పరిపాలన అనుమతులకు ఆమోదం తెలిపారు. బల్దియా సర్వసభ్య సమావేశం గంటలో ముగిసింది. మధ్యలో ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన గుండేటి నరేందర్‌కుమార్ మాత్రం కార్పొరేషన్‌లో నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని, కార్మికులకు చీపుర్లు లేక పారిశుధ్య పనులు సరిగా జరగడం లేదని ఆరోపించారు. దీనిపై బీఆర్‌ఎస్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు స్పందిస్తూ అలాంటిదేమీ లేదని, క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు సక్రమంగా జరుగుతున్నాయని ఆయన ఆరోపణలను తిప్పికొట్టారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు

### పాలకవర్గానికి సహకరిస్తాం : ఎమ్మెల్యేలు

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ పాలక వర్గానికి, వరంగల్ అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు. వివిధ గ్రాంట్ల ద్వారా రావాల్సిన నిధులను ప్రభుత్వ నుంచి తీసుకొచ్చేందుకు కృషిచేస్తామన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజవర్గంలోని మూడు డివిజన్లు గ్రేటర్‌లో ఉన్నాయని, వాటికి నిధులు ఇవ్వాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడూతూ ఐనవోలు జాతరకు కార్పొరేషన్ సహకారం అందించాలన్నారు.

### రాబోయే రోజుల్లో 24గంటల తాగునీటి సరఫరా : గుండు సుధారాణి, మేయర్

రాబోయే రోజుల్లో గ్రేటర్‌లో రోజూ 24గంటల తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ తెలిపారు. గత రెండున్నరేళ్ల పాలకవర్గ కాలంలో నగరాన్ని అభివృద్ధిలో తీసుకపోతున్నామని పేర్కొన్నారు. నగరాన్ని అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలిపేలా సహకరించాలని కోరారు. కొవిడ్ కేసులు పెరుగుతున్న తరుణంలో డివిజన్లలో పటిష్ట ప్రణాళికలతో పారిశుధ్య పనులు నిర్వహించేలా కార్యాచరణ చేస్తున్నామని చెప్పారు.



# మర్రిమిట్టలో విద్యార్థినికి కరోనా

గూడూరు, డిసెంబర్ 27 : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మర్రిమిట్ట గ్రామంలో ఓ విద్యార్థినికి కరోనా పాజిటివ్ వచ్చింది. గ్రామానికి చెందిన ఓ కుటుంబంలోని ఇద్దరు బాలికల్లో ఒకరు మరిపెడ బంగ్లా, మరొకరు మహబూబాబాద్ గిరిజన గురుకుల పాఠశాలలో పది, ఏడో తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో వారిద్దరు క్రిస్మస్ పండుగ సెలవులకు ఇంటికి వచ్చారు. వారికి దగ్గు, జ్వరం ఉండడంతో స్థానిక సీహెచ్‌సీలో ర్యాపిడ్ పరీక్షలు చేయించారు. వారిలో చిన్న అమ్మాయికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వీరన్న బుధవారం తెలిపారు.

# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

## మ్యానిఫెస్టోలోని 412 అంశాలను నెరవేర్చాలి

## స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జఫర్‌గఢ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్, డిసెంబర్ 27 : ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని, మ్యానిఫెస్టోలో పేర్కొన్న 412 అంశాలను నెరవేర్చాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశం బుధవారం పార్టీ మండలాధ్యక్షుడు పల్లెపాటి జయపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇప్పటికే రెండు గ్యారెంటీలు అమలు చేశామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఒక్కటే నెరవేర్చిందన్నారు. తప్పుడు ప్రచారాలతో ప్రజలను నమ్మించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. వైద్య కోసం ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.10 లక్షల వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పెంచి జీవో విడుదల చేసిందని శ్రీహరి గుర్తు చేశారు. రాష్ట్ర ఆదాయ వనరులు, ఆర్థిక స్థితిగతులను నిర్ధారించుకోకుండానే కాంగ్రెస్ నేతలు ఆరు గ్యారెంటీలు, 412 హామీలతో మ్యానిఫెస్టో విడుదల చేశారని ఎద్దేవా చేశారు. హామీలు అమలు చేయకుండా శ్వేతపత్రాల పేరిట బీఆర్‌ఎస్ పాలనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9వ తేదీన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి నేటికీ అమలు చేయలేదన్నారు. ధాన్యానికి చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రూ.500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పిన వీరు నేటికీ రాష్ట్రంలో క్వింటా ధాన్యాన్ని సేకరించలేదని శ్రీహరి విమర్శించారు. రైతుభరోసా పేరిట ఎకరానికి రూ.15 వేలు పెట్టుబడి సాయాన్ని ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రజల ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా ప్రజాపాలన పేరుతో ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు గ్రామాల్లో సభలు నిర్వహించడం కేవలం కాలయాపన కోసమేనన్నారు. హామీలను 100 రోజుల్లో నెరవేరుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో హామీ ఇచ్చాడని గుర్తు చేస్తూ కనీసం ఆరు నెలల్లోనైనా వీటిని అమలు చేయకుంటే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని శ్రీహరి స్పష్టం చేశారు.

### కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థలు, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి శ్రేణులు కృషి చేయాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జడ్పీటీసీ ఇల్లందుల బేబి, పీఏసీఎస్ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బ్రహ్మారెడ్డి, గుజ్జరి రాజు, నాయకులు మారుజోడు రాంబాబు, రాజేశ్‌నాయక్, కుల్లా మోహన్‌రావు, అయోధ్య, పెద్దిరెడ్డి, ఇల్లందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.